క్లుప్తంగా

నాణ్యతలో రాజీ పడొద్దు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని కార్పొరేటర్ ముమ్మన దేముడు హెచ్చరించారు. జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురం దరి గాయత్రీనగర్‌లో రూ.10.15లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ముమ్మన దేముడు పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ దుర్గాప్రసాద్, చందు యాదవ్, 95వవార్డు నాయకులు అంగటి సూరిబాబు, ఉమామహేశ్వరరావు, కాలనీ నిర్వాసితులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం:శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

సామూహిక సెలవు ఇవ్వాలని వినతి

సబ్బవరం: విజయవాడలో ఈ నెల 25న చేపట్టనున్న సత్యాగ్రహ దీక్షలో పాల్గొనేందుకు సమగ్ర శిక్ష ఉద్యోగులకు సామూహిక సెలవు ఇవ్వాలని ఉద్యోగులు కోరారు. దీనిపై స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవోలు లక్ష్మణరావు, బీవీఎస్ఎన్‌మూర్తికి శుక్రవారం ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. సమగ్ర శిక్ష సొసైటీలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చి రెగ్యులర్ చేయాలనే డిమాండ్ల సాధన కోసం ఈ సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎన్. కళాభారతి,ఎస్. లావణ్య,పి. దీపిక, కె. ముత్యాలనాయుడు, ఎస్. భూలక్ష్మి,ఎం. మహేష్,సింహాద్రి తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఆచార్యులకు అభినందన



ఆచార్యులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఆచార్య పురస్కారాలు అందుకున్న ఆచార్యులను ఏయూ వీసీ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం అభినందించారు. ఈ మేరకు వీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ఆచార్య పి.శ్యామల, ఆచార్య సి.వి.నాయుడు, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య కె.రమాసుధ, ఆచార్య డి.లలిత భాస్కరిలను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లల్లో 'పాలంబడి'

కంచరపాలెం: జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కూరగాయలు, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించడానికి 'పాలంబడి' కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు కంచరపాలెం రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. శ్రీనివాసరావు మొక్కలు నాటారు. వంగ, టమాటా, మిర్చి, కాలీఫ్లవర్ పాదులను విద్యార్థులతో నాటించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక

- హోరాహోరీగా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, మహాలక్ష్మినాయుడు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో తలపడనున్న క్రీడా జట్ల ఎంపిక శుక్రవారం చేపట్టారు. పెందుర్తి నియోజకవర్గ స్థాయి క్రీడా టోర్నమెంట్ కమ్ ఎంపికలు 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు పోటీలను , క్రీడా కోర్టులను ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్, టెన్నికాయిట్, త్రోబాల్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించి ఉమ్మడి విశాఖ స్థాయిలో ఆడనున్న జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో లంకెలపాలెం, తానాం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రౌతు నాగేశ్వరరావు, శ్రీదేవి, అనకాపల్లి, విశాఖ జిల్లాల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు ఎం.వి.నాగేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, పెందుర్తి నియోజకవర్గ కో–ఆర్డినేటర్ లక్ష్మీరాణి, పరవాడ మండల కో–ఆర్డినేటర్ లోవరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సుందరపు అప్పారావు, ఎలమర్తి వెంకటరావు, దాసరి తాతారావు, కాతా నూకేష్, కమిటీ చైర్మన్ కరణం సత్యవతి, వైస్ చైర్మన్ కోమటి వసంత, మూడు మండలాలకు చెందిన 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, 5 వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు.



షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక జట్లతో నిర్వాహకులు

ప్రభుత్వ భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలి

- అధికారులతో ట్రైనీ కలెక్టర్ స్మరణ్‌రాజ్



మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ట్రైనీ కలెక్టర్ స్మరణ్‌రాజ్

సబ్బవరం: మండలంలోని సచివాలయాలు,రైతు భరోసా కేంద్రాలు,వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వంటి ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ట్రైనీ కలెక్టర్ స్మరణ్‌రాజ్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆయన శాఖలవారీగా శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీల నిర్మాణం,జగనన్న ఆరోగ్య సురక్ష అమలు తీరుపై ఆరా తీశారు.ఖరీఫ్‌లో వ్యవసాయ పంటలు,ఎరువుల పంపిణీ,తెగుళ్ల ఉధృతి,నివారణకు చేపడుతున్న చర్యలు,స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా అందుతున్న సేవలు,నాడు–నేడు స్కూల్ భవనాలు,మధ్యాహ్న భోజనం అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీల ద్వారా అందుతున్న సేవలు, పశుసంవర్ధక శాఖలో అమలవుతున్న పథకాలపై ఆరా తీశారు. అదేవిధంగా సచివాలయాలకు వస్తున్న దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి సకాలంలో పరిష్కరించాలన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్ర పరిశీలన చేసి నిర్మాణంలో ఉన్న పలు ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ సత్యనారాయణ, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ఏవో ఎస్. బాబూరావు, ఎంఈవోలు లక్ష్మణరావు, బీవీఎస్ఎన్ మూర్తి, హౌసింగ్ ఏఈ శేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

- అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవు
- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి



అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దేవస్థానం అధికారులను ఆదేశించారు. సింహగిరిపై శుక్రవారం ఆయన దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం, ఆలయ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా భక్తులకు మంచినీరు విరివిగా అందించే చర్యలుతీసుకోవాలని, పారిశుధ్యం మెరుగుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అన్నప్రసాదం విభాగాన్ని పరిశీలించారు. సింహగిరికి వచ్చే ఏ ఒక్క భక్తుడు ఇబ్బందికి గురికాకుండా చూడాలని, అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఈఈ రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు,ఏఈ హరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, పీఆర్వో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



సిద్ధార్థరెడ్డిని కలిసిన సురేష్‌రాజ్

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్ విజయవాడలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో పార్టీ విజయానికి యువజన విభాగం కీలక భూమిక పోషించాలని సూచించారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

- ఎంపీపీ బోకం సూర్యకుమారి



రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఎరువులు అందజేస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. మండలంలోని గుల్లేపల్లి రైతు భరోసా కేంద్రంలో 10 టన్నుల యూరియాను శుక్రవారం ఆమె చేతులమీదుగా రైతులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటకు అవసరమైన యూరియా, పొటాష్ ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. అదే విధంగా చీడపీడల నివారణకు రైతులకు అవసమైన సూచనలు,సలహాలు అందించాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు.అమృతపురం,సబ్బవరం,తవ్వవానిపాలెం,గొల్లలపాలెం, అంతకాపల్లిలోని ఒక్కో రైతు భరోసా కేంద్రాలకు యూరియా చేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు హేమలత, రైతులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై హర్షాతిరేకాలు



మహిళలకు స్వీట్లు తినిపిస్తున్న గొర్లె రామునాయుడు

సింహాచలం: మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభించడంపై పెందుర్తి బీజేపీ కార్యాలయంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో మహిళలు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరా భిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం వెనుక ప్రధాని నరేంద్రమోదీ కృషి ఎంతో ఉందన్నారు.ఈ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు కె.వెంకట సన్యాసిరావు, పెందుర్తి రూరల్ అధ్యక్షుడు కాళ్ల జగన్ మోహన్, లక్ష్మణ్, మహిళాకార్యకర్తలు పాల్గొన్నారు.

5న ఢిల్లీలో బహిరంగ సభ



పరవాడలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఐద్వా కార్యకర్తలు

పరవాడ: మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని కోరుతూ అక్టోబరు 5న ఢిల్లీలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. ఢిల్లీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం పరవాడలో కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తి కావస్తున్నప్పటికీ మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళలు, చిన్నారులపై అనేక రకాల అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ముందడుగు వేస్తున్నప్పటికీ సమానత్వం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ సంఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని మాణిక్యం ఆరోపించారు. కార్యక్రమంలో శ్రీదేవి, రమణమ్మ, వరలక్ష్మి, వరహాలమ్మ, ఈశ్వరమ్మ, పద్మ, చిన్నమ్మలు పాల్గొన్నారు.

ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ ఏర్పాటుకు వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్టీ ఉద్యోగులకు ప్రత్యేకంగా అసోసియేషన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ఎస్టీ కమిషన్ సభ్యులు అనంత నాయక్‌ను ఉక్కునగరం ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఎం.కె. నాయక్, ప్రధాన కార్యదర్శి జి. సత్యనారాయణ కోరారు. పాడేరు పర్యటనకు విచ్చేసిన ఆయన్ను శుక్రవారం కలిసి, ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ఒకటే అసోసియేషన్ ఉండటం వల్ల ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించబడటం లేదన్నారు. కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు వేర్వేరు అసోసియేషన్లు ఉన్నాయని, స్టీల్‌ప్లాంట్ లోనూ ఆ విధంగా ప్రత్యేక అసోసియేషన్ ఏర్పాటు చేసేలా యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.

ముగిసిన క్వాలిటీ సర్కిల్స్ చాప్టర్ కన్వెన్షన్



విజేతకు సర్టిఫికెట్ అందిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎంలు స్వామి, శ్రీధర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో క్వాలిటీ సర్కిల్స్ చాప్టర్ కన్వెన్షన్ శుక్రవారం ముగిసింది. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఉక్కు మల్టీపర్పస్ హాలులో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన కన్వెన్షన్‌లో దేశవ్యాప్తంగా 33 సంస్థల నుంచి 650 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్ రియర్ అడ్మిరల్ ఆర్. విజయశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగి ప్రమేయమే కార్యక్షేత్రంలో విజయానికి కీలకమన్నారు. ఈ సందర్భంగా జరిగిన పోటీల్లో విజేతలకు పతకాలు అందజేశారు. ఎల్ అండ్ టీ డిఫెన్స్ జీఎం అతుల్ కుమార్ శ్రీవాస్తవ, యోకోహామా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ బి. ప్రహ్లాదరెడ్డి మాట్లాడుతూ చిన్న గ్రూపు కార్యకలాపాలు సంస్థలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం, చాప్టర్ చైర్మన్ జి.గాంధీ, డాక్టర్ జీఎం కమోడర్ సంజయ్‌కుమార్, చాప్టర్ కార్యదర్శి సాగర్, స్టీల్‌ప్లాంట్ సీజీఎంలు ఎస్.వి. స్వామి, యు.శ్రీధర్ ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భెల్ గేటు కోసం ఆందోళనలకు సిద్ధం



కుల సంఘాల పెద్దలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం వైపు గల భెల్ (హెచ్‌పీవీపీ) గేటు సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి నివాసంలో వార్డులోని కుల సంఘాల పెద్దలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. దశాబ్దకాలంగా గ్రామం వైపు గల భెల్ గేటును తెరవాలని ఆందోళనలు చేస్తున్నామని, గేటు తెరిస్తే వేలాదిమందికి ప్రయోజనకరంగా ఉంటుందని కార్పొరేటర్ తెలిపారు. ఈ నెల 25 నుంచి మూడు రోజుల పాటు గేటు వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకు ముందు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి సంస్థ యాజమాన్యంతో సమావేశం నిర్వహించి సమస్యను వివరించనున్నట్లు తెలిపారు. తర్వాత బీజేపీ ఎంపీ జీవీఎల్‌తో కూడా చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

రామేశ్వరరావుకు అభినందనలు



పరవాడ: నాగార్జున విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడిగా రక్షిత్ ఫార్మా గ్రూప్ సంస్థల అధినేత రామేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న విద్యార్థులు. చిత్రంలో ఉపకులపతి ఆచార్య శ్రీసుధ తదితరులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ 16వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని వర్సిటీలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో లయన్స్ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని వర్సిటీ ఉపకులపతి ఆచార్య డాక్టర్ శ్రీసుధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేసి.. ప్రాణదాతలుగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. ఈ శిబిరంలో 100 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ జోగినాయుడు, సమన్వయకర్త డాక్టర్ విశ్వచంద్ర, నిర్మలాదేవి, పీడీ ఓఎం రాజు, లయన్స్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి సుధాకర్, డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆస్పత్రికి అదనపు హంగులు

- రూ.30 కోట్లతో పలు భవనాల నిర్మాణం పూర్తి



ఆస్పత్రి సూపరింటెండెంట్ రామిరెడ్డికి భవనాలు అప్పగిస్తున్న ఏఈ నాయుడు



నూతనంగా నిర్మించిన భవనాలు

ఏయూక్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో అధునాతన భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రూ.30 కోట్ల వ్యయంతో 20 పడకల చిన్న పిల్లల మానసిక వైద్య విభాగం, 20 పడకల వృద్ధుల మానసిక వైద్య విభాగం, 40 పడకల డి అడిక్షన్ విభాగం, సరికొత్తగా పునరావాస కేంద్రం, పీజీ విద్యార్థుల హాస్టల్, అధునాతన సమావేశ మందిరాలతో కూడిన అకడమిక్ బ్లాక్‌ను ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక వసతుల కల్పనా సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) నిర్మించింది. ఈ భవనాలను అధికారికంగా శుక్రవారం సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.నాయుడు ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డికి అప్పగించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ కొత్తగా సమకూరిన మౌలిక వసతులతో ఆస్పత్రి సేవలు మరింత విస్తృతం అవుతాయన్నారు. త్వరలోనే ఫర్నిచర్ ఏర్పాటు చేసి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ భవనాలను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఆస్పత్రి అభివృద్ధికి నిధులు అందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా బిల్లు గాలిబుడగ వంటిది



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల నాయకులు

సీతమ్మధార : కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 128వ రాజ్యాంగ సవరణ బిల్లు గాలిబుడగ వంటిదని అఖిలభారత మహిళా సంఘాల సమన్వయ కమిటీ ఆంధ్రప్రదేశ్ నాయకురాలు ఎం.లక్ష్మి అన్నారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీ ఎన్నికల సందర్భంగా మహిళలకు ఇచ్చిన హామీల మాదిరే ఇది కూడా నమ్మకద్రోహం చేసేదిగా ఉందన్నారు. 2024లో జరగబోయే లోక్ సభ ఎన్నికలను ఉద్దేశించి తెచ్చారని అన్నారు. చాలా కాలంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్ ఉందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని అన్నారు.

రాజగణపతి అలంకరణలో సంపత్ వినాయకుడు



సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయంలో రాజగణపతి అలంకరణలో సంపత్ వినాయగర్ భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా గణపతి హోమం, నాదస్వర కచేరి, సర్వదర్శనం అనంతరం నారాయణ సేవ నిర్వహించినట్టు ప్రధాన అర్చకులు మోహన్‌స్వామి తెలిపారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.